క్లుప్తంగా

కాపర్ వైరు చోరీ



వేలేరు : ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరును గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. ఈ సంఘటన మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం .. మల్లికుదుర్ల గ్రామంలో శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని ఆయిల్‌ను పడబోసి కాపర్ వైరు ఎత్తుకెళ్లారని తెలిపారు. చోరీ చేసిన కాపర్ వైరు విలువ రూ.3 వేలు ఉంటుందని తెలిపారు. ఏఈఈ కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత



వేలేరు : మండల కేంద్రానికి చెందిన కనకం రామమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందింది. విషయం తెలుసుకున్న నవ చైతన్య యూత్ అసోసియేషన్ సభ్యులు బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.3 వేల నగదు, 25 కిలోల బియ్యం అందించి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు కోడూరి శ్రీకర్, యూత్ సభ్యులు ప్రేమ్‌కుమార్, ప్రశాంత్, రాజు, పరమేశ్, మహేష్, శివప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇకనైనా కళ్లు తెరవాలి

హన్మకొండ: విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రైవేట్ విద్యాలయాల యాజమాన్యాలు ఇకనైనా కళ్లు తెరవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి పేర్కొన్నారు. సోషల్ స్టేటస్ కోసం, మార్కుల మోజులో, ర్యాంకుల వేటలోపడి పిల్లల మానసిక స్థితిని పరిగణలోకి తీసుకోకుండా ఒత్తిడికి గురిచేస్తున్న వాళ్లందరికీ విద్యార్థిని శివాని ఆత్మహత్య ఓ గుణపాఠం వంటిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని శివాని ఆత్మహత్య మొదటిది కాదని, అయితే, చివరిది అయ్యేలా తామంతా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పిల్లల అభిరుచి, వారి లక్ష్యాన్ని గుర్తించకుండా, పరిగణలోకి తీసుకోకుండా తల్లిదండ్రులు చేసిన ఒత్తిడితో వారు బలన్మరణాలకు పాల్పడుతున్నారని ఆయన తెలిపారు.

గుండెపోటుతో టీచర్ మృతి

విద్యారణ్యపురి: హనుమకొండ చైతన్యపురిలో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు అలుగువెల్లి జవహర్‌రెడ్డి (61) అనారోగ్యంతో మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్‌కు జిల్లా హుజూరాబాద్‌కు చెందిన జవహర్ రెడ్డి (జవహర్ పటేల్) 1984లో ఎస్‌జీటీగా నియమితులై భీమదేవరపల్లి, ఎల్కతుర్తిలో సుదీర్ఘకాలం ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఇటీవల కమాన్‌పూర్ మండలం నర్సింహులపల్లికి బదిలీ అయి అక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. ఆయన కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. మృతుడికి భార్య శ్రీదేవి, కుమారులు శశాంక్ రెడ్డి, శంతన్‌రెడ్డి ఉన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి అవార్డు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం అయోధ్యపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మన్నె చంద్రయ్యకు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవారత్న అవార్డు అందజేశారు. చంద్రయ్య సామాజిక సేవలకుగాను స్నేహితుల దినోత్సవం సందర్భంగా బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు ఆదివారం ఉత్తమ సేవారత్న అవార్డును అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రెసిడెంట్ పులి దేవేందర్, కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగుల సేవలు అభినందనీయం

గీసుకొండ: మహిళా సంఘాల ఉన్నతికి సీసీ గడ్డి అశోక్, ఏపీఎం సురేశ్‌కుమార్ చేసిన సేవలు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చాయని సెర్ప్ స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. గడ్డి అశోక్ ఉద్యోగ విరమణ, ఏపీఎం సురేశ్‌కుమార్ ఐనవోలు మండలానికి బదిలీ అయిన సందర్భంగా ఆదివారం కొనాయమాకులలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మరింత మెరుగైన పనితీరుతో లక్ష్యాలను చేరుకోవడానికి ఉద్యోగులు కృషి చేయాలని ఆకాంక్షించారు. సీసీల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు నర్సయ్య, జిల్లా అధ్యక్షుడు గోలి కొమురయ్య, మాజీ జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు రడం భరత్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో జీపీ కార్యాలయాలు



శిథిలావస్థకు చేరిన పులుకుర్తి జీపీ కార్యాలయం



పెచ్చులూడిన జీపీ భవనం గోడలు

- అద్దె భవనాల్లో కార్యకలాపాలు
- ఇబ్బందుల్లో సిబ్బంది
- నిధులు కేటాయించినా ప్రారంభం కాని పనులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

దామెర : గాంధీజీ కలలుగన్న స్వరాజ్యం సాధించాలంటే గ్రామాల్లో సుపరిపాలన అందించాల్సిన అవసరం ఉంది. గ్రామాల్లో అన్ని శాఖల కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించి అన్ని మౌలిక వసతులు కల్పించినప్పుడే ప్రతిగ్రామం అభివృద్ధిలో పయనిస్తుంది. కానీ ఇందుకు భిన్నంగా మండలంలోని కొన్ని గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ముస్త్యాలపల్లి గ్రామంలో గల గ్రామ సచివాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో దానిని తొలగించారు. నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయించినా స్థల విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో పనులు ఇంతవరకు ప్రారంభించలేదు. కాగా గ్రామంలోని వాటర్‌ప్లాంట్ భవనం నుంచి పరిపాలన కొనసాగిస్తున్నారు. పసరగొండ గ్రామంలో గ్రామపంచాయతీ భవనం పైకప్పు పెచ్చులు ఊడటంతో పాటు వర్షం వస్తే భవనంలోకి నీరుచేరి ముఖ్యమైన పత్రాలు రిజిష్టర్లు తడిసి ముద్దవుతున్నాయని సిబ్బంది మొరపెట్టుకుంటున్నారు. దీంతో విధులు నిర్వహించాలంటే భయాందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొందంటున్నారు. పులుకుర్తిలో గ్రామ పంచాయతీ భవనం కొన్ని సంవత్సరాల క్రితం పెంకులతో ఏర్పాటు చేసింది. కాగా ప్రస్తుతం శిథిలావస్థకు చేరి వర్షం వస్తే కురుస్తుండటంతో టార్పాలిన్ కవర్లు కప్పి నెట్టుకొస్తున్నారు.

ఏకాభిప్రాయం కుదరక

మండల కేంద్రంలో పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే దుస్థితి నెలకొందని సిబ్బంది వాపోతున్నారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఒక గదిలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. పంచాయతీ భవన నిర్మాణం కోసం గత ప్రభుత్వం హయాంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బస్టాండ్ ఏరియాలో శంకుస్థాపన చేశారు. కానీ భవనం నిర్మించే స్థలం విషయంలో ఏకాభిప్రాయం లేకపోవడంతో భవన నిర్మాణ పనులు ప్రారంభించలేదు. అనంతరం ప్రభుత్వ పాఠశాల సమీపంలో, పీహెచ్‌సీ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని భావించగా చివరగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మండల భవనాల సముదాయం కోసం కేటాయించిన స్థలంలో నిర్మాణం చేయాలని భూమి పూజచేశారు. కానీ ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాకపోవడంతో జీపీ భవన నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పక్కా భవనాలు నిర్మించాలని కోరుకుంటున్నారు.

భవనం నిర్మించాలి



మండల కేంద్రంలో సుమారు 30 సంవత్సరాల క్రితం నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. నూతన భవన నిర్మాణం కోసం మూడుచోట్ల ప్రతిపాదనలు చేసి, చివరికి రైతు వేదిక సమీపంలో భూమి పూజచేశారు. నిర్మాణ పనులు త్వరగా చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

– వేల్పుల రాజ్‌కుమార్, దామెర

గ్రంథాలయం పునఃప్రారంభం



గ్రంథాలయాన్ని పునఃప్రారంభిస్తున్న ఎంప్లాయీస్ అసోసియేషన్ బాధ్యులు

కమలాపూర్ : మండలంలోని మర్రిపల్లిగూడెంలో ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామ గ్రంథాలయాన్ని ఆదివారం పునఃప్రారంభించారు. గ్రామంలోని పేద విద్యార్థులు, ఉద్యోగుల కోసం ఇటీవల ఉద్యోగులు అసోసియేషన్ ఏర్పాటు చేశారు. గ్రామంలో సరైన పుస్తకాలు అందుబాటులో లేక మూతబడిన గ్రంథాలయానికి తమ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రస్తుత పోటీ పరీక్షలకు అవసరమైన పలు పుస్తకాలను సమకూర్చి ఆ గ్రంథాలయాన్ని పునఃప్రారంభించారు. భవిష్యత్‌లో డిజిటల్ గ్రంథాలయంగా తీర్చిద్దేందుకు కృషిచేస్తామని ఎంప్లాయీస్ అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కోసం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అంతకుముందు ఉద్యోగులు సమావేశమై ప్రాథమిక, ఉన్నత పాఠశాలల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించుకున్నారు. మర్రిపల్లిగూడెం ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి అజ్మత్‌పాషా, సభ్యులు చొక్కారావు, హుస్సేన్, రవీందర్, ఐలయ్య, అచ్యుత్, శ్రీనివాస్, రాములు, సంపత్, మహాజన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజలు శాస్త్రీయంగా ఆలోచించాలి

- జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు రమేశ్



పీచర హైస్కూల్ హెచ్‌ఎం శ్రీదేవికి సభ్యత్వం అందజేస్తున్న రమేశ్

వేలేరు : నేటి ఆధునిక యుగంలో ప్రజలు మూఢనమ్మకాలను పాటించకుండా శాస్త్రీయంగా ఆలోచించాలని జనవిజ్ఞాన వేదిక ఉమ్మడి ధర్మసాగర్ మండల అధ్యక్షుడు రమేశ్ అన్నారు. ఆదివారం జేవీవీ సభ్యత్వాలను పలువురికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని మూఢనమ్మకాలు పట్టి పీడుస్తున్నాయని, వాటిని తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఉపాధ్యాయులు, మేధావులు, ప్రొఫెసర్లు, వివిధ రంగాల నిపుణులు, యువత జన విజ్ఞాన వేదిక సభ్యత్వాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తిరుపతి, రాజు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఆయిల్‌పామ్ సాగు చేయాలి

శాయంపేట : రైతులు ఆయిల్‌పామ్ పంటను సాగు చేసి అధిక లాభాలను పొందాలని ఏఓ గంగాజమున ఆదివారం తెలిపారు. ఆయిల్‌పామ్ మొక్క ప్రైవేట్‌గా తీసుకుంటే రూ.190 ఉంటుందని, ప్రభుత్వం రూ.20 అందిస్తుందన్నారు. ఎకరానికి కేవలం రూ.1200 మాత్రమే పెట్టుబడి అవుతుందన్నారు. రైతులు ఆయిల్‌పామ్ పంట వేసిన 3 సంవత్సరాల వరకు రైతులు అంతర పంటలు సాగుచేసుకోవచ్చని, అంతర పంటలు సాగు చేసినందుకు ఎరువులకు ప్రభుత్వం 4 సంవత్సరాల వరకు రూ.16,800 రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ పంట సాగు చేస్తే ఎకరానికి 10 నుంచి 12 టన్నుల దిగుబడితో రైతులకు రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుందన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



రవీందర్ (ఫైల్)

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన కొలిపాక రవీందర్ (65) అనే వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 27వ తేదీన రవీందర్ టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై నీళ్లప్లాంట్ దగ్గర వాటర్‌తో వెళ్తుండగా వెనుక నుంచి ఏపీ 29 ఏసీ 6709 నంబరు గల కారు డ్రైవర్ అతివేగంగా వచ్చి రవీందర్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో రవీందర్‌కు తీవ్ర గాయాలుకాగా వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : జీవితంపై విరక్తి చెంది మనస్తాపంతో వ్యక్తి గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని నీరుకుళ్లలో చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నీరుకుళ్ల గ్రామానికి చెందిన పోతరాజు వీరయ్య (59) అనారోగ్య బాధలు భరించలేక జీవితంపై విరక్తి చెంది శనివారం గడ్డిమందు తాగాడు. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు పోతరాజు భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు సీఐ సంతోశ్ తెలిపారు.

సీఐ రంజిత్‌రావుకు రజత పతకం



ఉన్నతాధికారుల చేతులమీదుగా హార్ట్‌లైనర్ ట్రోఫీ, రజత పతకాన్ని అందుకుంటున్న సీఐ రంజిత్‌రావు

శాయంపేట : వరంగల్‌లో జరిగిన 2వ రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో శాయంపేట సీఐ రంజిత్‌రావు హార్ట్ లైనర్ ట్రోఫీతో పాటు రజత పతకాన్ని అందుకున్నారు. ఆదివారం వరంగల్‌లో జరిగిన కార్యక్రమంలో డీజీపీలు జితేందర్, సౌమ్యమిశ్రా, ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, సీపీ సన్‌ప్రీత్, డీసీపీ అంకిత్ చేతుల మీదుగా హార్ట్ లైనర్ ట్రోఫీతో పాటు రజత పతకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సీఐని శాయంపేట ఎస్సై జక్కుల పరమేశ్, పోలీస్ సిబ్బంది అభినందించారు.

కరపత్రం ఆవిష్కరణ

శాయంపేట : తెలంగాణ ఉద్యమ నాయకుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ ఉర్దూ దినపత్రిక ఎడిటర్ జైరుద్దీన్ అలీఖాన్ రెండో వర్ధంతి సభ కరపత్రాన్ని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ దామెరకొండ కొమురయ్య ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 6న జరిగే వర్ధంతికి మేధావులు, ఉద్యమకారులు, కవులు, కళాకారులు తరలిరావాలని కోరారు. నాయకులు పాపయ్య, రమేశ్, రాజయ్య, కట్టయ్య, రమేశ్ పాల్గొన్నారు.

నిరుపేద మహిళకు చేయూత

విద్యారణ్యపురి: కమలాపూర్ గ్రామానికి చెందిన మార్గం పావనికి హనుమకొండలోని వడ్డేపల్లిలోని విద్యా ఫౌండేషన్ కార్యాలయంలో ఉచితంగా కుట్టు మిషన్‌తో పాటు రూ.5 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్ మాట్లాడుతూ పావని కుటుంబం చాలా దీనావస్థలో ఉందని అన్నారు. ఆమె భర్త రెండు కాళ్లు చచ్చుబడడంతో ఎలాంటి పనులు చేసుకోలేకపోతున్నాడని పేర్కొన్నారు. ఈక్రమంలో ఆ పేద కుంటుంబానికి విద్యా ఫౌండేషన్ తరపున చేయూతనిచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు బిట్ల అంజనీదేవి, అనంతుల ఉష, వైద్యులు వాణి, రాణి, చింతల కమల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

ఖిలా వరంగల్: వరంగల్ ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బండి కోటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం నోటుబుక్స్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ ఉమ హాజరై వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్‌తో కలిసి ఎంపిక చేసిన విద్యార్థులకు నోటుబుక్స్ అందజేశారు. న్యూడెమోక్రసీ నేత రాజేందర్, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్, నలిగంటి పాల్, పుప్పాల భీమయ్య, పుప్పాల రాజు, బండి శ్రీకాంత్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అండగా ఉంటాం

కాజీపేట రూరల్: జర్నలిస్టులకు అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, మాజీ ఎంపీ పసునూరి దయాకర్ అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ పాస్టల్ సెంటర్‌లో తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం రెండో రాష్ట్ర మహాసభ సన్నాహక సమావేశం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు హాజరై మాజీ కార్పొరేటర్ బోడ డిన్నాతో కలిసి ఈ నెల 12న హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరగనున్న మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధులని అన్నారు. తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల నాగేందర్, మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్, మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లికొండ వీరేందర్, తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొల్లెపాక రాజేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి పెండ్యాల సుమన్, ప్రేమ్, గూడూరు కరుణాకర్ పాల్గొన్నారు.

సీఐటీయూ కార్యవర్గం ఎన్నిక

హసన్‌పర్తి: సీఐటీయూ భవన నిర్మాణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దామెర చంటి, ఉపాధ్యక్షులుగా నద్దునూరి రజనీకాంత్, మేకల సురేష్, ప్రధాన కార్యదర్శిగా దామెర పవన్‌కల్యాణ్, కార్యదర్శిగా మంద చందర్, కోశాధికారిగా దామెర ప్రశాంత్, ఆర్గనైజర్లుగా పుల్లా సిద్ధార్థ్, పరికి రాజశేఖర్‌తో పాటు మరో పది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు సీఐటీయూ హసన్‌పర్తి మండల కార్యదర్శి పుల్లా అశోక్ వివరించారు.

గోవిందాద్రి సేవాదళ్ లోగో ఆవిష్కరణ

రామన్నపేట: వరంగల్ నగరంలోని గోవిందరాజుల స్వామి దేవాలయం మెట్ల వద్ద సేవాదళ్ సభ్యులు సేవాదళ్‌లోగోను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భవిష్యత్‌లో సేవాదళ్ ఆధ్వర్యంలో చేపట్టే గోశాల నిర్వహణ, భజగోవింద, దళిత గోపాలం కృష్ణాష్టమి వేడుకలు వంటి అంశాలపై కార్యవర్గ సభ్యులు చర్చించారు. ఈ ఏడాది నిర్వహించే గోవింద రక్ష కార్యక్రమానికి వరంగల్ నగరంలోని మహిళా ప్రముఖులందరిని ఆహ్వానించాలని నిర్ణయించారు. అతి కొద్దికాలంలోనే గోవిందాద్రి సేవాదళ్‌ను హిందూ సంఘాల ఐక్యవేదిక గుర్తించడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. గోవిందాద్రి సేవాదళ్ సేవలను వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కోరారు. గోశాల నిర్వహణపై అవగాహన కల్గి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ గౌరవ అధ్యక్షుడు చింతాకుల అనిల్, వ్యవస్థాపక అధ్యక్షుడు రంజిత్‌కుమార్, అధ్యక్షుడు యాట ప్రతాప్, సహాయ కార్యదర్శి ధనలక్ష్మి, ఉపాధ్యక్షురాలు పట్టాబి రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



ఐనవోలు : పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, క్యాబ్ చైర్మన్ రవీందర్‌రావు

ఐనవోలు : విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. ఆదివారం మండలంలోని పున్నేలు గ్రామంలో దాత సహకారంతో నిర్మిస్తున్న ప్రభుత్వ పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను టీజీ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయించి విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి సహకరిస్తున్న దాత కొయ్యాడ రామ్మూర్తిని అభినందించారు. గ్రామాల్లో చదువుకుని ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్న ప్రతిఒక్కరూ పే బ్యాక్ టుదా సొసైటీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సారయ్య, మహేందర్, సుధీర్‌గౌడ్, రుగ్వేద్‌రెడ్డి, దేవేందర్‌గౌడ్, సాంబయ్య, బుచ్చిరెడ్డి, రాకేష్‌రెడ్డి, ఎలిషా తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి: అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలు అందజేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. రెండో డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో బాలవికాస సంస్థ సహకారంతో రూ.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా సమస్య ఉన్నట్లయితే డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం 80961 07107 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎనీ టైమ్ వాటర్ కార్డులను కాలనీవాసులకు అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రవినాయక్, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన, బాలవికాస సంస్థ డైరెక్టర్ శౌరెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, కొంక హరిబాబు, నాయకులు కుక్క తిరుపతి, మాదాసి అజయ్, కాలనీవాసులు కృష్ణ, రవికుమార్, తారమ్మ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి బీజేపీతో సాధ్యం



దామెర : ప్రచారం చేపట్టిన మాజీ ఎమ్మెల్యే రమేశ్



శాయంపేట : పత్తిపాకలో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న రామకృష్ణ

- మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్

దామెర : గ్రామాల అభివృద్ధి బీజేపీతో సాధ్యమని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్‌లో సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు గతంలో ఎన్నడూలేని విధంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరికీ అర్థమయ్యేలా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలని కోరారు. రాష్ట్ర నాయకులు కాశీప్రసాదరావు, మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు రతన్‌కుమార్, నాగరాజు, మధూకర్, బుచ్చిరెడ్డి, సతీష్, ముఖేష్, చందర్, చంద్రకిరణ్, మనోజ్‌రెడ్డి, శ్రీను, రాజు, సత్యం పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

శాయంపేట : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని పత్తిపాక, మాందారిపేట గ్రామాల్లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తూ సబ్కా సాత్–సబ్కా వికాస్– సబ్కా విశ్వాస్ నినాదంతో ముందుకు సాగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి 11 ఏళ్లు గడిచినప్పటికీ అంత్యోదయమే లక్ష్యంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినప్పటికీ ఎలాంటి అభివృద్ధి సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, రాజశేఖర్, సాంబయ్య, సుధాకర్, రాజుకుమార్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల మహాసభను జయప్రదం చేయాలి



వేలేరు : మాట్లాడుతున్న నాయకులు

వేలేరు / దామెర : ఈనెల 7న హసన్‌పర్తిలో జరిగే వికలాంగులు, చేయూత పింఛన్‌దారుల మహాసభలను జయప్రదం చేయాలని వేలేరు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మనోజ్‌కుమార్, మండల ఇన్‌చార్జ్ శాంతిసాగర్, దామెర ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం వేలేరు మండలంలోని షోడాషపల్లి, దామెర మండలంలోని ఒగ్లాపూర్‌లో పింఛన్‌దారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా వికలాంగులకు రూ.6 వేలు, చేయూత పింఛన్‌దారులకు రూ.4 వేలు పెంచి ఇచ్చేవరకు ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని అన్నారు. లింగయ్య, రాజయ్య, యాదగిరి, వెంకటేష్, పూలమ్మ, లచ్చమ్మ, రాజమ్మ పాల్గొన్నారు.

గొర్రెల కాపరుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న లింగయ్య

ఆత్మకూరు : గొర్రెలు, మేకల పెంపకం దారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. మండలంలోని పెంచికలపేటలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గొర్రెలకు, మేకలకు ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. పెంపకందారులు ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. 50 ఏళ్లు దాటిన పెంపకందారులకు నెలకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో కుల పెద్దలు సాంబయ్య, రాజు, సొసైటీ అధ్యక్షుడు చంద్రమౌళి, జీఎంపీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కుమార్, లింగయ్య, మొగిళి, నర్సయ్య, సుధాకర్, భీమన్న, రాజయ్య, సాంబయ్య, సారయ్య, కొమురయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

శాయంపేట : సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని గట్లకానిపర్తి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నారు. ఆదివారం గట్లకానిపర్తి గ్రామంలో గతంలో ఏర్పాటు చేసిన సీసీకెమెరాలు మరమ్మతుకు చేరగా టెక్నీషియన్‌ను పిలిపించి బాగు చేయించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీసీకెమెరాల హార్డ్ డిస్క్‌ను అందించిన బొమ్మకంటి కుమార్‌ను గట్లకానిపర్తి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో 7 కెమెరాలు అమర్చినట్లు వెల్లడించారు. ఇంకా కొన్ని కెమెరాలు అవసరం ఉన్నాయని, దాతలు ముందుకు వచ్చి సహకరించాలని అన్నారు. నేరాల పరిశీలనలో సీసీ కెమెరాలు ప్రముఖ పాత్ర పోశిస్తాయని అన్నారు. గ్రామంలోని చిరువ్యాపారస్తులు, ప్రజలు సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని ఈ సందర్భగా ఆ సంఘం నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.